ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 30 జూన్ 2024

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 25.0

పెన్షన్ల పంపిణీపై సీఎస్ సమీక్ష

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వెట్రి సెల్వి చెప్పారు. జూలై 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ సచివాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని ఏర్పాట్లను సీఎస్‌కు కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో జూలై 1వతేదీ ఉదయం 6 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, 1 వ తేదీనే 90 నుంచి 95 శాతం మేర పెన్షన్లు పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. వీసీలో జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, ఏలూరు కమిషనర్ వెంకటకృష్ణ, ఎల్డీఎం నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్ : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ జూలై 1 నుంచి ఇంటింటికి అందించ డానికి పటిష్ఠ చర్యలు చేపట్టి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. శనివారం అమీనాపేటలోని శాంతినగర్, 94వ వార్డు సచివాలయం, ఏలూరు రూరల్ మండలం మల్కాపురం వార్డు సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించి పెన్షన్ పంపిణీ ప్రక్రియపై సచివాలయ సిబ్బందిని వివరాలను ఆరా తీశారు. సచివాలయానికి సంబంధించి సిబ్బంది డ్రాచేసిన పెన్షన్ సొమ్ము భద్రత పై ఆరా తీశారు. జూలై 1న ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ ప్రారంభించాలని, నూరుశాతం పెన్షన్ సొమ్ము అంద జేయాలని ఆదేశించారు. సొమ్ము అందజేసిన తర్వాత తీసుకోవాల్సిన రశీదును సీరియల్ వారీగా కలెక్టర్ పరిశీలించారు. పెన్షన్ పంపిణీకి సంబంధించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, దానిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అమీనాపేటలోని సచివాలయం భవనంలో ఉన్న డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించారు.డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ, డీడీవో ఏ.బి.వి.బి లక్ష్మి, ఏలూరు ఎంపీడీవో బండి ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ రకం	జూన్‌లో పెన్షన్ మొత్తం	జూలైలో పెంపు చేసిన మొత్తం
వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, మత్స్యకారులు, టోడీ ట్యాపర్లు నేత కార్మికులు, సంప్రదాయ చెప్పులు కుట్టేవారు, డప్పు కళాకారులు, కళాకారుల పెన్షన్లు, ఏఆర్‌టీ పెన్షన్లు	రూ.3,000	రూ.4,000
దివ్యాంగ పెన్షన్లు, మల్టీ డిఫార్మిటీ లెప్రసీ	రూ.3,000	రూ.6,000
డయాలిసిస్, తలసేమియా మేజర్, సికిల్ సెల్ డిసీజ్ తీవ్రమైన హిమోఫిలియా	రూ.10,000	రూ.10,000
ద్వైపాక్షిక ఎలిఫాంటియాసిస్ - గ్రేడ్ 4, డయాలసిస్ చేయించుకోని క్రానిక్ కిడ్నీవ్యాధి రోగులు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి	రూ.5,000	రూ.10,000
పక్షవాతం వ్యక్తిని చక్రాల కుర్చీ లేదా మంచానికి పరిమితం చేయడం	రూ.5,000	రూ.15,000
తీవ్రమైన కండరాల క్షీణత కేసులు, ప్రమాద బాధితులు	రూ.5,000	రూ.15,000
చక్రాల కుర్చీకి లేదా మంచానికి పరిమితమైన వారు		
సైనిక్ వెల్ఫేర్	రూ.5,000	రూ.5,000
అభయ హస్తం	రూ.500	రూ.500



పింఛన్ల పండుగ

రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- రేపు జిల్లా వ్యాప్తంగా 2.68 లక్షల మందికి రూ.182 కోట్ల పింఛన్
- తెల్లవారుజాము నుంచే ప్రారంభించి.. ఒక్కరోజులోనే పూర్తికి ఏర్పాట్లు
- పెరిగిన పింఛన్.. ఇదే ఆల్‌టైమ్ రికార్డ్
- విధి నిర్వహణలో సచివాలయ, ప్రభుత్వ సిబ్బంది 5వేల మంది

పేదలందరూ కోరుకున్న రోజు రానేవచ్చింది. కూటమి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత రేపు తొలిసారిగా పేదలందరికీ పింఛన్ పండుగ నిర్వహిస్తోంది. ప్రతినెల ఇచ్చే రూ.3వేలను కాస్త రూ.4 వేలకు పెంచడమే కాకుండా గడిచిన మూడు నెలల పింఛన్‌తో కలిపి ఒకేసారి రూ.7వేలు అందించనుంది. పేదల కళ్ళల్లో వెలుగులు నింపేందుకు వారికి ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా కూటమి ఇప్పటికే వేగంగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద ఒక్క ఏలూరు జిల్లాలోనే 2లక్షల మందికి పైగా పింఛన్‌దారులకు రూ.182 కోట్లు మేర రేపు పింఛన్ అందించేందుకు సకల సన్నాహాలు పూర్తి చేసింది. ఉదయం వేకువజాము నుంచి ఇంటింటికి వెళ్లి ఒక్క రోజులోనే నూటికి నూరుశాతం పింఛన్లు అందించేందుకు రంగం సిద్ధమైంది. పేద ప్రజలారా... అందుకోండి రూ.7వేల పింఛన్.

- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

పేదలకు ఇది భరోసానే..

ఇప్పటివరకు పేదలకు పింఛన్లు పెంచి ఇవ్వడంలో తెలుగుదేశం ప్రభుత్వానిదే అగ్రస్థానం. ఒకప్పుడు కాంగ్రెస్ హయాంలో రూ.200 ఉన్న పింఛన్, చంద్రబాబు హయాంలో ఇప్పుడు రూ.4వేలకు పెరగబోతోంది. గత ప్రభుత్వంలోనూ పింఛన్లు పెంచి ఇస్తామని అప్పటి జగన్ ప్రభుత్వం అవ్వాతాతలు అంటూనే అందర్నీ మోసగించింది. కాని కూటమి ఎన్నికల సమయంలో తాము అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని, మిగతా వారందరికీ వివిధ కేటగిరిల కింద పింఛన్ పెంపుదల అమలు చేస్తామని, అటు తెలుగుదేశం అధ్యక్షుడు హోదాలో చంద్రబాబు సమాంతరంగా పవన్ కల్యాణ్ ప్రజలకు భరోసా ఇస్తూ వచ్చారు. తమను విశ్వసించి గెలిపిస్తే ఇప్పటివరకు మూడునెలల పాటు ఉన్న పెండింగ్ నెలకు వెయ్యి చొప్పున మూడునెలలు లెక్కకట్టి జూలై 1వ తేదీనే అందిస్తామని విధాన ప్రకటన చేశారు. ఇదంతా ఎన్నికల సమరాంగణంలోనే.. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పేదలకు పెంచుతామన్న పింఛన్‌ను ఆఘమేఘాల మీద ఆచరణలోకి తెచ్చారు. వృద్ధాప్య, వితంతువులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, కల్లు గీత కార్మికులు, నేత కార్మికులు, చెప్పులు కుట్టు వారు, డప్పు కళాకారులు ఇలాంటి వారందరికీ రూ.3 వేల నుంచి రూ.4వేలకు పింఛన్ పెంచుతూ విధాన నిర్ణయం తీసుకున్నారు. వీటితో పాటు మరో ఆరు కేటగిరిల్లో ఉన్న వారందరికి పింఛన్ పెంచుతూ పోయారు. దివ్యాంగ పింఛన్‌లను రూ.3వేల నుంచి రూ.6వేలకు, కిడ్నీ రోగులకు, కాలేయం, గుండెమార్పిడి రోగులకు రూ.5 వేల నుంచి రూ.10వేలు, పక్షవాతంతో మంచం పట్టిన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలు కండరాల క్షీణత కలిగిన వ్యాధిగ్రస్తులకు రూ.5వేల నుంచి రూ.15 వేలు పెంచుతూ కూటమి ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవడమే కాకుండా రేపటి నుంచి పెరిగిన పింఛన్‌ను ఆయా బాధితులు అందరికీ అందజేయబోతున్నారు. రాష్ట్రచరిత్రలో పింఛన్లు ఈ స్థాయిలో పెరగడం ఇదే రికార్డు. సాధారణంగా ప్రభుత్వ విధాన నిర్ణయం ప్రకారం పింఛన్ పెంచాల్సి వస్తే రూ.100 రూ.200 పెంచుతూ పోయేవారు. కాని సమస్య తీవ్రతను బట్టి మానవతా దృక్పథంతో ఇచ్చిన మాట నిలబెట్టుకునే క్రమంలో ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా కూటమి ప్రభుత్వం ఈ ధైర్యం చేసింది.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఈ పేరు ఎలా వచ్చిందంటే..



డీపీవో శ్రీనివాస్

2014 ముందువరకు ప్రభుత్వ పథకాలకు అక్కడక్కడ మాత్రమే వివిధ వ్యక్తుల పేర్లు పెట్టే వారు. కాని అంతవరకు పింఛన్ల విషయంలో సామాజిక పింఛన్లుగానే భావిస్తూ పేదలకు అందరికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 32 లక్షల మందికి అందించేవారు. 2014 అక్టోబరు 1న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో పింఛన్ సీనే మారి పోయింది. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులు అందరితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇదే సందర్భంలో తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఎంపీడీవోగా ఉన్న ప్రస్తుత డీపీవో తూతిక శ్రీనివాస్ ప్రభుత్వానికి అప్పట్లో ఓ సూచన చేశారు. జన్మభూమి - మాఊరు పథకం అమలు సందర్భంగానే చంద్రబాబు పింఛన్ల విషయం ప్రస్తావిస్తున్నప్పుడు... ప్రజలు అందరికీ ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలకు ఒక పేరు ఉంటే బావుంటుందని పింఛన్ పథకానికి భరోసా అంటే ఉత్తమంగా ఉంటుందని, పేదలందరికీ ప్రత్యేక భరోసా ఇచ్చిన ఎన్టీఆర్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయన పేరుతోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కింద పింఛన్ పథకానికి నామకరణం చేస్తే బావుంటుందంటూ శ్రీనివాస్ ప్రభుత్వానికి ఒక సూచన చేశారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించారు. ఆ మేరకు 2014, అక్టోబర్ 2న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పేరిట సరికొత్త నామకరణం చేసి ఉత్తర్వులను జారీ చేశారు.

పంపిణీ ఎలా అంటే..

ఎన్టీఆర్ భరోసా కింద ఏలూరు జిల్లాలో పింఛన్ అందుకునే పెన్షన్‌దారుల సంఖ్య 2లక్షల 68 వేల 353 వీరందరికీ పెంచిన పింఛన్‌తో పాటు గడిచిన మూడునెలల పెండింగ్‌ను కలిపి జూలై నెలలోనే 182.73 కోట్లను చెల్లించబోతున్నారు. గడిచిన మూడునెలలుగా ఎన్నికల సమయంలో పింఛన్ దారులతో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆటలాడుకుంది. అనేక మంది చావులకు కారణమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలు అంటూ... తెలుగుదేశం లక్ష్యంగా పేదల పింఛన్‌తో చెలగాటం ఆడింది. పింఛన్ ఇంటింటికి ఇవ్వకుండా అడ్డదారులు తొక్కింది. బ్యాంకు ఖాతాల్లో వేసింది. ఇది తమకు సమ్మతమే కాదని, మంచాన పట్టిన వారంతా బోరుమన్నా కేవలం ఓట్ల రాజకీయమే వైసీపీ చేసింది. కాని రేపటి నుంచి పింఛన్ల పంపిణీ సరికొత్త పుంతలు తొక్కబోతోంది. గత ప్రభుత్వంలో మూడురోజుల పాటు పింఛన్ల పంపిణీ సాగేది. అది వలంటీర్ల చేతుల మీదుగానే. కాని ఈసారి గ్రామ సచివాలయ వ్యవస్థలో ఉన్న ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను రంగంలోకి దింపారు. శనివారం సాయంత్రం నాటికే దాదాపు 182 కోట్ల నగదును ఎక్కడికక్కడ బాధ్యులకు అందించి, సోమవారం తెల్లవారుజామున 5.30 నుంచి పింఛన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది 4,539 మందితో పాటు ప్రభుత్వ సిబ్బంది మరో 826 మందితో కలిపి పింఛన్ల పంపిణీలో 5,365 మంది ఉద్యోగులు భాగస్వాములు కానున్నారు.

పంపిణీలో ప్రజాప్రతినిధులు

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రేపు తలపెట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు చేతికి అందించే క్రమంలో వేల మంది ఉద్యోగులు భాగస్వాములు అవుతుండగా, అక్కడక్కడ కూటమి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కాబోతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు పేదలకు పింఛన్లు అందించడంలో తమవంతు పాత్ర పోషించబోతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ఒక్కరోజే అందరికీ పింఛన్

- కలెక్టర్ వెట్రిసెల్వి

'జిల్లావ్యాప్తంగా ఉన్న పింఛన్‌దారులు అందరికీ సోమవారం ఉదయం తెల్లవారు జాము నుంచే పింఛన్ పంపిణీ చేయాలి. ఆ మేరకు రూ.182 కోట్లు నగదును సిద్ధం చేశాం. జిల్లావ్యాప్తంగా ఉన్న 2,68,353 మంది పింఛన్ దారులకు సోమవారం ఉదయం తెల్లవారుజాము నుంచి సాయంత్రం లోపు అందరికి ఖచ్చితంగా పింఛన్ అందాల్సిందే. ఎక్కడా లోటుపాట్లు జరగకూడదు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందరికీ అందాల్సిందే. ఈ విషయంలో యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేశాం' అని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి శనివారం మీడియాతో అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ పంపిణీలో సచివాలయ సిబ్బందితో పాటు ప్రభుత్వ సిబ్బందిని తొలిసారిగా వినియోగిస్తున్నట్టు ప్రకటించారు. తెల్లవారు జామునుంచే పింఛన్ పంపిణీ ఆరంభమై పూర్తయ్యేంత వరకు కొనసాగుతుందని ప్రకటించారు. ఈనెలలో పెరిగిన పింఛన్ రూ.4 వేలతో పాటు అదనంగా పెండింగ్‌లో ఉన్న రూ.3వేలను కలిపి రూ.7వేలు పింఛన్ అందించబోతున్నట్టు వెల్లడించారు. పింఛన్‌దారులు ఎవరూ నయాపైసా సిబ్బందికి ఇవ్వరాదని, ఎవరైనా ఈ రకంగా ఆశిస్తే తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం నాటికే బ్యాంకుల నుంచి నగదు సంబంధిత అధికారులకు చేరిందని కలెక్టర్ చెప్పారు. ప్రతి ఒక్కరికి 50 మంది చొప్పున పింఛన్‌దారులకు సొమ్ము అందేలా మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న రైతుసంఘం నాయకులు

కృష్ణాడెల్టాకు సాగునీరు విడుదల చేయాలి

- సుంకరవారితోట పంట భూముల్లో రైతుల ధర్నా

ఏలూరు రూరల్, జూన్ 29: కృష్ణాడెల్టాకు సార్వా సాగుకు సాగునీరు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఏలూరు శివారు సుంకరవారితోట పంట భూముల్లో రైతులు ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. కృష్ణా డెల్టాకు సాగునీటిని అందించాలని నినాదాలు చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు సమయం నెలరోజులు దాటి పోయినా, జూలై వస్తున్నా కృష్ణాడెల్టా భూములకు సాగునీరు విడుదల చేయకపోవడం, నారుమళ్ళు వేసుకోవడానికి కూడా అవకాశం లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిన్ని పోతురాజు, భైరెడ్డి లక్ష్మణరావు, అన్నం రెడ్డి రంగారావు, ఏ.నాగరాజు, పిట్టా రమణ, టి.జయరాజు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

రెండో అదనపు జిల్లా జడ్జి మంగకుమారి

ఏలూరు క్రైం, జూన్ 29 : సామరస్యంగా కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి జాతీయ లోక్ అదాలత్ కక్షి దారులకు మంచి వేదికని రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి తెలిపారు. శనివారం ఏలూరు జిల్లా కోర్టులో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ముందు న్యాయసేవాసదన్ భవనంలో జాతీయ లోక్‌అదాలత్‌పై న్యాయవిజ్ఞాన సదస్సును జడ్జి మంగకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ ఏళ్ళ తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం వృథా చేయకుండా జాతీయ లోక్ అదాలత్ ద్వారా సామరస్య ధోరణిలో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఐ.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ జాతీయలోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారానికి ముందుకు వచ్చిన వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ, ఇతర న్యాయ మూర్తులు, న్యాయవాదులు, జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వాహన ప్రమా దంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి భార్యకు నష్ట పరిహారం కింద నేషనల్ ఇన్సూరెన్సు కంపెనీ ద్వారా రూ. 37 లక్షల నష్టపరిహారం చెక్కును అడ్మినిస్ట్రేషన్ జడ్జి మంగకుమారి అందజేశారు. ఐదవ అదనపు జిల్లా జ రాజేశ్వరి కక్షిదారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అబ్బినేని విజయ్‌కుమార్, సుబ్బారావు, కక్షిదారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి మంగకుమారి

1530 కేసులు పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి అన్ని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1530 కేసులు పరిష్కారం అయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ తెలిపారు. వీటిలో 154 సివిల్ కేసులు, 129 వాహన ప్రమాద బీమా కేసులు, 1247 క్రిమినల్ కేసులు, 102 ప్రీలిటిగేషన్ కేసులు రాజీ చేసినట్టు తెలిపారు.



పెరిగిన గోదావరి 7

శ్రీవారి క్షేత్రానికి అల్పపీడనం ఎఫెక్ట్



స్టాప్ డయేరియా.. క్యాంపైన్‌పై ఫేస్‌బుక్ పేజీ

- ప్రారంభించిన కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు సిటీ, జూన్ 29 : జిల్లాలో డయేరియా నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి చెప్పారు. కలెక్టరేట్‌లో శనివారం స్టాప్ డయేరియా క్యాంపైన్‌పై సోషల్ మీడియా ద్వారా అవగాహనకు పేస్‌బుక్ పేజీని కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధి రాకుండా నివారణ చర్యలు ప్రధానమని, జిల్లాలో ఎవ్వరూ డయేరియా బారిన పడకుండా స్టాప్ డయేరియా క్యాంపైన్ ద్వారా జిల్లా అంతటా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్టాప్ డయేరియా క్యాంపైన్ కార్యక్రమాన్ని జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వతేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

వరదలకు ముందస్తుగానే రక్షణ చర్యలు

జిల్లాలో తుఫానులు, వరదలు సంభవిస్తే ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు రక్షణ చర్యలకు ప్రభుత్వ యంత్రాగాన్ని సిద్ధం చేసినట్టు కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో అధిక వర్షపాతం నమోదు కాలేదని, అయినప్పటికీ నదులు, చెరువుల గట్లను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పటిష్ఠ పరచాలని ఆదేశించామన్నారు. ప్రజలను అప్రమత్తం చేసే అంశంపై ముందుగానే ప్రణాళిక రూపొందించామన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు మూడు నెలలకు పైగా సరిపడా నిత్యావసర సరుకులను ముందుగానే తరలిస్తామన్నారు.



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించండి

- డీఈవో కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 29 : నగరంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని, ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లను నిర్ధీత పేద కుటుంబాల పిల్లలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏలూరు జిల్లా డీఈవో కార్యాలయం వద్ద సీపీఎం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘ నగరశాఖ కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా యూనిఫాం దుస్తులు, పుస్తకాలు, మెటీరియల్‌ను విక్రయిస్తూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. చాలా పాఠశాలల్లో అర కొరగా వసతులు ఉంటున్నాయని ఆరోపించారు. కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వం నుంచి ఒక స్కూలుకే అనుమతి తీసుకుని రెండు పాఠ శాలలను నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు సాయిబాబు, జగన్నాథరావు, ప్రసాద్, ఇస్సాక్, శారద, వెంకటలక్ష్మి, లక్ష్మీ కుమారి, ఏసుబాబు, నరసింహమూర్తి, సత్తిరాజు, ప్రభుకిరణ్, మొహిద్దీన్, ఆంథోని, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

వీడని ముసురు

ఏలూరు సిటీ, జూన్ 29 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా జిలా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో రాబోయే రెండు రోజుల్లో వర్షాలు కురిసే ఆవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సార్వా సాగు జరుగుతున్న తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా చింతలపూడి మండలంలో 22.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో గడచిన 24 గంటల్లో సరాసరి వర్షపాతం 6.8 మి.మీ నమోదైంది. కుక్కునూరు 19, కామవరపుకోట 18.6, ద్వారకా తిరుమల 16.2, బుట్టాయిగూడెం 13, టి.నరసాపురం 11.2, కొయ్యలగూడెం 9.8, జీలుగుమిల్లి 9.2, కైకలూరు 8.6, వేలేరుపాడు 5.6, జంగారెడ్డిగూడెం, లింగపాలెంలలో 4.8, కలిదిండి 4.6, పెదవేగి 4.2, ఏలూరు అర్బన్‌లో 4, చాట్రాయి, ఏలూరు రూరల్‌లో 3.6, పెదపాడు 3.4, ఉంగుటూరు, మండవల్లిలో 3.2, ముదినేపల్లిలో 3, పోలవరం 2.8, దెందులూరులో 2.6, ముసునూరు, నిడమర్రులలో 2.4, ఆగిరిపల్లిలో 1.8, భీమడోలులో 0.8, నూజివీడులో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

బోరుబావుల కింద వరినాట్లు

చాట్రాయి, జూన్ 29: చాట్రాయి గ్రామ పరిధిలో బోరుబావుల కింద వరినాట్లు మొదలైయ్యాయి. జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు రాగానే బోరుబావుల కింద వరినార్లు పోయడంతో ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. ఈ గ్రామంలో వరిసాగు భూముల్లో దాదాపు రైతులందరూ పచ్చిరొట్ట సాగు చేశారు. కొన్ని రోజుల నుంచి చెదురుమదురు వర్షాలు పడుతుండటంతో వరి మడులలో కొద్దిగా నీరు నిలుస్తున్నది. దీనికి తోడు బోరు నీరు పెట్టి పచ్చిరొట్ట ట్రాక్టర్‌తో దున్ని, మాగిన తర్వాత దమ్ము చేసి వరినాట్లు వేస్తున్నారు.



చాట్రాయిలో బోరుబావుల కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

ఆర్‌బీకేలు ఇక నుంచి రైతు సేవా కేంద్రాలు

ఏలూరు సిటీ, జూన్ 29 : గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన డా. వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల పేరును మార్పు చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక నుంచి రైతు భరోసా కేంద్రాలు రైతు సేవా కేంద్రాలుగా పిలువబడతాయి. అదే విధంగా రైతు భరోసా కేంద్రాలలో ఉండే నవరత్నాలు లోగోలు, గత సీఎం ఫొటోలు వంటివి తక్షణమే తొలగించాల్సి ఉంది. అదే విధంగా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన వ్యవ సాయ సలహా మండలిలను రద్దు చేశారు. ఆర్‌బికె ఛానల్ / స్టూడియోను ఇక నుంచి పాడిపంటలు చానల్/ స్టూడియోగా పిలుస్తారు. డా. వైఎస్ఆర్ రైతు భరోసా మాస పత్రిక పేరును పాడి పంటలు మాసపత్రికగా మార్పు చేశారు. ఈ ఉత్తర్వు లన్నీ వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

జిల్లాలో 520 రైతు భరోసా కేంద్రాలు

గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో కార్యకలాపాలు అంతంత మాత్రంగానే జరిగాయనే విమర్శలు ఉన్నాయి. కేవలం ధాన్యం కొనుగోలు సమయంలోనే ఈ ఆర్‌బీకేలను వినియోగించేవారు. మిగిలిన వ్యవసాయ కార్యక్రమాలకు చెందిన కార్యకలాపాలు అంతంత మాత్రమే. జిల్లాలో 520 రైతు భరోసా కేంద్రాలు ఉండగా వీటిలో వ్యవసాయ శాఖకు సంబంధించి 480 ఆర్‌బీకేలలోను, 40 కేంద్రాలు మత్స్యశాఖకు సంబంధించిన కార్యకలాపాలు జరిగేవి. ఇప్పుడు ఈ కేంద్రాల పేరును మార్పు చేయడంతో పాటు వీటిని అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెబుతున్నారు.

పెరిగిన గోదావరి

» ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పెరుగుతున్న నీటిమట్టం

పోలవరం, జూన్ 29 : పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలో గోదావరి నీటిమట్టం శనివారం నాటికి పెరిగింది. గత సోమవారం జలవనరుల శాఖ అధికారులు సీలేరు నుంచి రెండు వేల క్యూసెక్కుల విడుదల చేసిన జలాలు, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పొంగిన కొండవాగుల జలాలతో పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన గోదావరి నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 22.950 మీటర్లు, స్పిల్వే దిగువన 15.300 మీటర్లు, కాఫర్ డ్యాంకు ఎగువన 23.000 మీటర్లు, కాఫర్ డ్యాంకు దిగువన 13.920 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు ఈఈ పి.వెంకటరమణ తెలిపారు.

పాపికొండలకు బోట్ల రాకపోకలు ప్రారంభం

పాపికొండల విహార యాత్ర బోట్ల రాకపోకలు పునఃప్రారంభించామని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్.గంగబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు పాపికొండల పర్యటన బోట్ల రాకపోకలు పునరుద్ధరించామన్నారు. పాపికొండల విహార యాత్రకు ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేసుకొను పర్యాటకులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సంబంధిత నంబర్లకు కాల్ చేసి నిర్ధారించుకుని టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.





పోలవరం ప్రాజెక్టు స్పిల్వే వద్ద నీరు



ద్వారకాతిరుమల ఆలయంలో ఖాళీగా వైకుంఠం క్యూకాంప్లెక్స్.. క్యూలైన్‌లో తక్కువ మంది భక్తులు

శ్రీవారి క్షేత్రానికి అల్పపీడనం ఎఫెక్ట్

» ఆలయ ప్రాంగణంలో తగ్గిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూన్ 29: అల్పపీడన ప్రభావం చినవెంకన్న క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీపై పడింది. స్వామికి ఇష్టమైన రోజుకావడంతో ప్రతీ శనివారం క్షేత్రానికి వేలాది సంఖ్యలో యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. శనివారం అల్పపీడన ప్రభావం కొనసాగుతుండడంతో ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. ఉదయం 11 గంటల నుంచి కాస్త భక్తుల రద్దీ పెరిగింది. తొలుత నామమాత్రంగా భక్తజన సంచారం నెలకొంది. దాదాపు ఆరు వేల మంది వరకు భక్తులు క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి పూజించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా శనివారం 15 నుంచి 20 వేల మంది వరకు భక్తులు క్షేత్రానికి వస్తారు. అల్పపీడన ప్రభావంతో ఆలయంలోని అన్ని విభాగాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

పోలవరం ప్రాజెక్టుకు ట్రైనీ ఐఏఎస్‌ల సందర్శన

పోలవరం/ఏలూరు కలెక్టరేట్/బుట్టాయగూడెం, జూన్ 29 : పోలవరం ప్రాజెక్టును ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శనివారం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ 2023-24 సంవత్సరం బ్యాచ్ ఐఏఎస్ ట్రైనీలు ఆరుగురు పోలవరం ప్రాజెక్టుకు చేరుకుని స్పిల్వే, హిల్‌వ్యూ, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, పవర్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు, వారికి ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత వివరాలను తెలిపారు. ఈ బృందంలో ఏపీలో కర్నూలు, చిత్తూరు, గుంటూరు, అనంతపురం, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాలకు నియమించిన ట్రైనీ కలెక్టర్లు సీహెచ్ కళ్యాణి, దామెర హిమవంశీ, పవార్ స్వప్నిల్ జగన్నాద్, బొల్లిపల్లి వినూత్న, హెచ్ఎస్ భావన, సుభమ్ నోక్వాల్ ఉన్నారు. పోలవరం తహసీల్దారు జీవీ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్, పీవోను కలసిన ట్రైనీ ఐఏఎస్‌లు

జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఏలూరు చేరుకున్న ఏపీ ట్రైనీ ఐఏఎస్‌లు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సూర్యతేజను ట్రైనీ ఐఏఎస్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలు వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్అండ్ఆర్ పథకంలో నిర్వాసితులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు తదితర వివరాలను ఐటీడీఏ పీవో వివరించారు.



పోలవరం ప్రాజెక్టు వివరాలు పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

మంత్రి లోకేశ్‌ను కలసిన మాజీ మంత్రి సుజాత




భీమవరంటౌన్,జూన్ 29 : గత టీడీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అంబేడ్కర్ విదేశీ విద్యాపథకం పేరు మళ్లీ పెట్టడంపై మంత్రి లోకేశ్‌ను మాజీ మంత్రి పీతల సుజాత కలసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉండవల్లిలో లోకేశ్‌ను కలసి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో అంబేడ్కర్ పేరుపెడితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పేరు తొలగించి అంబేడ్కర్‌ను అవమానించిదన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులు యువతకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల మేరకు సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధికి సినీనటుల సాయం

సినీ నిర్మాత అశ్వనీదత్ రూ.5 లక్షలు. నటుడు రావురమేష్ రూ.3 లక్షలు

ఉండి, జూన్ 29 :ఉండి డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహాయనిధికి సినీ నటులు సాయం అందిస్తున్నారని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ రూ.5లక్షలు, సినీ నటుడు దివంగత రావుగోపాలరావు తనయుడు రావు రమేష్ రూ.3 లక్షలు అందించారు. ఈవిధంగా అంతా ముందుకు వచ్చి తనకు అండగా నిలిచి డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహాయనిధికి ముందుకు రావడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలిపారు.



ఉండి ఎమ్మెల్యే రఘురామకు చెక్కు అందిస్తున్న సినీనటుడు రావురమేష్

నేషనల్ వాటర్ పోలో టోర్నమెంట్‌కు నాగసింధు



నాగసింధును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 29 : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జూలై ఏడో తేదీ నుంచి పదో తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి వాటర్‌పోలో టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థిని ఐ.నాగసింధు అర్హత సాధించిందని స్కూలు ప్రిన్సిపాల్ పి.సాయికుమారి శంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పతకం సాధించడం ద్వారా బాలిక జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. విజేతను సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆచంట ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

ఆచంట, జూన్29 : ఆచంట ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో 2024-25విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత అనగా మొదటి విడతలో మిగిలిన సీట్ల కోసం కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఐటీఐలో చేరగోరు విద్యార్థులు ధ్రువపత్రాల నకళ్లను స్వయంగా కళాశాలకు జూలై 24వ తేదీ లోపు అందజేయాలన్నారు. జూలై 24న కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఒరిజినల్‌సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని మరిన్ని వివరాలకు సెల్‌నెం. 9490111002కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భీమవరంటౌన్, జూన్ 29 :మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, మాదక ద్రవ్య వ్యసనం ఆర్థిక సంక్షోభంలో పడేస్తుందని, కుటుంబం, స్నేహితులతో మీ సంబంధాన్ని నాశనం చేస్తుందని సీఐ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం భీమవరం డీఎన్నార్ జూనియర్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిస కావడం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలతో కుంగిపోవడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ చాలా నష్టపోతుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు పోలీసుశాఖ అనేక రకాల చర్యలు చేపడుతుందన్నారు. ఎక్సైజ్ ఆఫీసర్ చిట్టిబాబు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాల వద్ద తెలియని వ్యక్తులు చాక్లెట్, ఇతర వస్తురూపంలో ఇచ్చినట్టయితే అటువంటి స్వీకరించరాదని పిల్లలు, యువతను కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మత్తు పదార్థాల క్రయ విక్రయాలు సమాచారాన్ని పోలీస్ అధికారులకు తెలియజేసి జిల్లా పోలీస్ శాఖ సహకరించాలన్నారు.



విద్యార్థులు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ప్రిన్సిపాల్ శివాజీ రాజు, కృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు సొసైటీలో అవకతవకలపై విచారించాలి

» జిల్లా కలెక్టర్‌కు కొత్తోట వాసి ఫిర్యాదు

మొగల్తూరు, జూలై 29 : మొగల్తూరు వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవకతవకలను విచారించాలని సంఘ సభ్యుడు కొత్తోట గ్రామానికి చెందిన పడవల సూర్యనారాయణ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు శనివారం మొగల్తూరులో విలేకరులకు తెలిపారు. సంఘ ఛైర్‌పర్సన్, ఆయన కుటుంబ సభ్యుల పేరున 63 ఖాతాల ద్వారా రూ.1కోటి 67 లక్షల 63వేల 295లు రుణాలను సరైన పత్రాలు సమర్పించకుండా పొందారని ఈ మొత్తానికి సంబంధించి ప్రతీ ఏటా వడ్డీ, అసలును పెంచుతూ రుణాలు పెంచుతున్నారన్నారు. చెల్లించే వడ్డీలోనూ రాయితీని నిబంధనలకు విరుద్ధంగా పొందుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలులోనూ హమాలీ చార్జీల పేరుతో రూ.80 లక్షలు వరకు ఖర్చు చేయకుండా వాడుకున్నట్టు ఆరోపించారు. సంఘంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుండగా కోర్టు నుంచి స్టే రాకపోవడంతో వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సహకారంలో నాటి మంత్రి ద్వారా స్టే తెచ్చుకుని విచారణ మధ్యలో నిలిపివేశారన్నారు. ప్రభుత్వం మారినందున వైసీపీ మంత్రి ఇచ్చిన స్టేని రద్దు చేయించి సంబంధిత అధికారులు స్పందించి మొగల్తూరు సహకార సంఘంలో అవినీతిని వెలికి తీసి సంఘ సొమ్ము అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రికవరీ చేసి సంఘాన్ని పరిరక్షించాలని కలెక్టర్‌ను ఫిర్యాదు పూర్వకంగా కోరినట్టు తెలిపారు.

సొసైటీ కార్యదర్శి రత్నాజీని సస్పెండ్ చేశాం

» జంగారెడ్డిగూడెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి గురజాల

జంగారెడ్డిగూడెం, జూన్ 29:జంగారెడ్డిగూడెం పీఏసీఎస్ సొసైటీ రైతులకు చెందిన నగదును దుర్వినియోగ పర్చిన కార్యదర్శి రత్నాజీని సస్పెండ్ చేశామని పీఏసీఎస్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా శనివారం బాధ్యత లు స్వీకరించిన గురజాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సొసైటీలో నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణలో కార్యదర్శి రత్నాజీ నగదు దుర్వినియోగ పరిచిన ఆధారాలు లభించడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారన్నారు. శనివారం ఆయనకు సస్పెన్షన్ పత్రాలు అందించామన్నారు. సొసైటీ ఖాతాదారులు సోమవారం నుంచి యథావిధిగా కార్యాలయంలో సేవలు పొందవచ్చని తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు సహించం

కైకలూరు, జూన్ 29: కూటమి గెలుపుతో రాష్ట్రంలోనే కాక కైకలూరు నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరులో కూటమి నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కైకలూరు నియోజకవర్గంలో అరాచకాలు పెరిగిపోయాయంటూ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. అనివేటి మండపం, హిందూ శ్మశాన వాటిక నిర్మాణాలను దాతల సహకారంతో చేశారని వాటి జమా ఖర్చులను బయటపెట్టాలన్నారు.

డీజీపీ ద్వారకాతిరుమలరావుకు జోగయ్య లేఖ

పాలకొల్లు, జూన్ 29: ఒక మోసకారి తన పేరుతో ముఖ్యులైన తన మిత్రులకు ఫోన్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు శనివారం మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య లేఖ రాశారు. ఒక వ్యక్తి 78010 96535 సెల్ నెంబరు నుంచి తన మిత్రులకు ఫోన్ చేస్తున్నాడని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ మాజీ మంత్రులు జానారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ ఎంపీ సుజనాచౌదరి, నరసాపురం మాజీ ఎంపీ కొత్తపల్లి సుబ్బారాయుడు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసులకు ఆ వ్యక్తి ఫోన్ చేసి నాకేదో అత్యవసరం వచ్చిందని చెప్పగా నిజమేనని నమ్మి వీరందరూ ఆ వ్యక్తికి డబ్బులు ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఆ వ్యక్తి చేసే పని వల్ల తన పరపతి దెబ్బతింటుందన్నారు. ఈ ఘటనలను తాను పాలకొల్లు సీఐ, ఎస్ఐలకు ఆరు మాసాలు క్రితం తెలియపర్చినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇంకా ఈ ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ అగంతుకుడిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

శ్రీవారికి రాష్ట్ర జనసేన ప్రొటోకాల్ చైర్మన్ పూజలు



ఆలయంలో పూజలు జరుపుకుంటున్న తిరుమలరావు

ద్వారకాతిరుమల, జూన్ 29: చినవెంకన్న క్షేత్రాన్ని జనసేన పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్నీడి తిరుమలరావు (బాబి) సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. తొలుత స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం పండితుల నుంచి స్వామివారి శేషవస్త్రాన్ని, ఆశీర్వచనాన్ని, ప్రసాదాలను పొందారు, కార్యక్రమంలో కూటమి నేతలు ఇమ్మడి రత్నాజి, కూరాకుల బుజ్జి, గువ్వల మావుళ్లు, రేవూరి వెంకటేశ్వరరావు, అంజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ.13 లక్షలు

ముదినేపల్లి, జూన్ 29: ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హుండీలు లెక్కించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సంధ్య, దేవదాయశాఖ గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పర్యవేక్షణలో సిబ్బంది నిర్వహించిన లెక్కింపులో 197 రోజులకు రూ.13 లక్షల నగదు, 5 గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి లభించాయి. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ శొంఠి నాగరాజు, వల్లభనేని రామకృష్ణ, శ్రీ దుర్గా సాయి సంఘ కమిటీ సభ్యులు, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, వీఆర్వో రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.





ఏలూరు, భీమవరంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరించిన ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

పోలీస్ శాఖలో సేవలు అభినందనీయం

» రిటైర్డ్ సిబ్బందిని సన్మానించిన ఉమ్మడి పశ్చిమ జిల్లా ఎస్పీలు

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, జూన్ 29 :పోలీస్ శాఖలో 40 ఏళ్లపాటు సేవలందించడం అభినందనీయం అని, వీరంతా అందరికీ ఆదర్శనీయులని ఉమ్మడి పశ్చిమ జిల్లాల ఎస్పీలు మేరీ ప్రశాంతి, అజిత వేజెండ్ల అన్నారు. పోలీస్ విభాగంలో పనిచేస్తూ ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసులను శనివారం ఏలూరు, భీమవరంలలో సన్మానించారు. ఏలూరు జిల్లాలో తొమ్మిది మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా పని చేస్తున్న ఎ.జగజ్జీవన్‌రామ్, వీఆర్ ఎస్ఐ బీపీసీ శేఖరరావు, వీఆర్ ఎస్ఐ వీవీ నాగేశ్వరరావు, ఏలూరు సీసీ ఎస్ఐ ఎస్.రాధాకృష్ణారెడ్డి, మండవల్లి ఏఎస్ఐ పి.జోసఫ్, ఏలూరు ట్రాఫిక్ ఏఎస్ఐ జి.దిలీప్‌కుమార్, జిల్లా ఆర్మ్‌డు రిజర్వు విభాగం ఏఆర్ఎస్ఐ వీవీఆర్ వర్మ, నూజివీడు రూరల్ ఏఎస్ఐ జి.నరసింహారావు, ధర్మాజీగూడెం హెడ్‌కానిస్టేబుల్ సి.మంగయ్యను సన్మానించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పదవీ విరమణ పొందిన వారు హెచ్ రెహమాన్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (వీఆర్), ఎస్.హనుమంతరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్), ఎ.శ్రీనివాసరావు, అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (భీమవరం రూరల్ పీఎస్), టి.పాండురంగారావు, హెడ్ కానిస్టేబుల్ (మొగల్తూరు పీఎస్) వీరికి పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ అజిత వేజెండ్ల చేతుల మీదుగా సన్మానించారు. శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని వారు సూచించారు.

ఆకట్టుకున్న దశావతార కోలాట నృత్యం

ద్వారకాతిరుమల, జూన్ 29: శ్రీవారి క్షేత్ర తూర్పు రాజగోపురం వద్ద శనివారం సాయంత్రం దశావతారములతో కోలాట నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. దాదాపు 222 మంది బృందసభ్యులు పాల్గొన్నారు. పొద్దుటూరుకు చెందిన సావిత్రిబాయి పూలే కోలాట బృంద సభ్యులు దశావతారాలైన మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బలరామ, బుద్ధ, కల్కి అలంకరణలో నృత్య ప్రదర్శన జరిపారు, ఇది చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కోలాటం మాస్టర్ జె.సాయిభరత్ నేతృత్వంలో బండి మల్లిక దీనిని నిర్వహించారు.



ఆలయ తూర్పు రాజగోపురం వద్ద నృత్యప్రదర్శన

క్రైం కార్నర్

రెండు లారీల మధ్య ఇరుక్కుని జట్టు కూలీ దుర్మరణం

» ప్రత్తిపాడు గొడౌన్ వద్ద ఘటన.. కేసు నమోదు

పెంటపాడు, జూన్ 29 : రెండు లారీల మధ్య ఇరుక్కుని ప్రమాదవశాత్తు జట్టు కూలీ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం రూరల్ మండలం వెంకట్రామన్నగూడెంకు చెందిన నల్లమాటి తాతారావు(43) కొంతకాలంగా ప్రత్తిపాడు నుంచి రాచర్ల రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీరూరల్ గొడౌన్‌లో జట్టు కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం యూరియా ఎరువులతో వచ్చిన లారీలో సరుకును గొడౌన్‌లోకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో సరుకును దించేసిన లారీ డ్రైవర్ వెనుక ఉన్న లారీని గమనించకుండా లారీని వెనక్కి రివర్స్ చేయడంతో ఎరువులు మోస్తున్న తాతారావు రెండు లారీల మధ్య చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూన్ 29 :ఆర్థిక పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న ఆర్టీసీ డ్రైవర్ మనస్తాపంతో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని కొత్తగూడెంకు చెందిన గూడాబత్తుల జోసఫ్(48) ఏలూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

ఒకరిని కొట్టి, బెదిరించిన తొమ్మిది మందిపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 29:జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన గోలి హరీష్‌కుమార్ ఇంటిపై హైదరాబాద్ చిత్రపురి కాలనీకి చెందిన గౌరీశంకర్ మరో ఎనిమిది మంది దౌర్జన్యంగా ప్రవేశించి కొట్టి, చంపుతామని బెదిరించిన వారిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గోలి హరీష్‌కుమార్‌కు చెందిన ఓ కేసు కోర్టులో ఉంది. ఈ నేపథ్యలోట కేసు ఉపసంహరించుకోవాలని ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌కు చెందిన గౌరీశంకర్ మరో ఎనిమిది మంది హరీష్‌కుమార్‌ను జంగారెడ్డిగూడెంలో ఇంటికి వచ్చి బెదిరించారు. హరీష్‌కుమార్ అందుకు నిరాకరించడంతో అతడిపై దాడి చేశారు. హరీష్ కుమార్ రాజమహేంద్రవరంలో చికిత్స పొందిన తర్వాత జంగారెడ్డిగూడెం కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు గౌరీశంకర్ మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 29 : ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఒక వ్యక్తి తిరిగి రాలేదని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరులోని ఆర్ఆర్ పేటకు చెందిన నలభై ఏళ్ల వయసు గల మన్నా దుర్గాప్రసాద్ ఈనెల 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి కోసం వెతికినప్పటికి ఆచూకీ కానరాలేదు. అతడి భార్య నాగమణి ఏలూరు టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పాలకోడేరు, జూన్ 29: నడుస్తూ వెళ్తున్న మహిళ మెడ నుంచి గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెళుతూ మెడలో ఉన్న బంగారం తాడును అపహరించిన ఘటన పెన్నాడలో శనివారం ఉదయం జరిగింది. గ్రామానికి చెందిన మునకాల రాజేశ్వరి అనే మహిళ ఉదయం గ్రామంలోనే నైన్ రెస్టారెంట్ సమీపంలో హైవేపై నడిచి వెళ్తుండగా భీమవరం నుంచి పాలకొల్లు వైపు వెళ్తున్న మోటారు సైక్లిస్టు వెనుక నుంచి వెళ్లి మహిళ మెడకలో ఉన్న రెండున్న కాసుల బంగారు గొలుసును అపహరించి వెళ్లిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాలకోడేరు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

దెందులూరు, జూన్ 29 : విద్యుదాఘాతంతో గేదె మృతి మృతి చెందిన ఘటన దెందులూరు మండలం రామారావుగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన కొత్తపల్లి రామారావుకు చెందిన గేదె పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన మేత మేస్తుండగా వర్షం కురుస్తుండడం చేత నేల తేమగా ఉండడంతో గేదె మేత మేస్తూ విద్యుత్ స్తంభం సమీపానికి వెళ్లడంతో విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. బాధితుడు ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.85 వేల విలువైన గేదె మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయానని, ఆదుకోవాలని కోరాడు.

7న బియ్యం వేలం

భీమవరం టౌన్, జూన్ 29 : ప్రజాపంపిణీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ, రవాణా చేస్తున్న వారిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి సీజ్ చేసిన బియ్యం 11.525 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వచ్చే నెల 7వ తేదీ వేలం వేస్తున్నట్టు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఉండి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఆరోజు ఉదయం 11 గంటలకు వేలం వేస్తామని వేలంపాటలో వచ్చిన గరిష్ఠ ధరను జేసీకి నివేదించి వచ్చిన సొమ్మును సివిల్ సప్లయ్ హెడ్ ఖాతాలో డిపాజిట్‌లో జమ చేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వ్యాపారులు జీఎస్టీ లైసెన్స్ కలిగి ఉండాలని, ముందుగా రూ.5 వేలు దరావతుగా చెల్లించాలన్నారు. వేలంపాట వివరాలను కలెక్టర్‌కు వివరించి ఖాయం చేసిన తరువాతనే హెచ్చు పాటదారునికి సరుకు అప్పగిస్తామన్నారు. వేలం నిలుపుదల చేయడం గాని, రద్దు పరిచే అధికారం జిల్లా అధికారులకు ఉందన్నారు.

మద్ది ఆంజనేయు స్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి


న్యాయమూర్తి కుటుంబానికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

జంగారెడ్డిగూడెం, జూన్ 29 : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని ఏపీ హైకోర్టు న్యాయ మూర్తి వెంకట జ్యోతిర్మయి ప్రతాప శనివారం కుటంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండల రావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదాలు ఈఓ కొండలరావు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్, జంగారెడ్డిగూడెం మేజిస్ట్రేట్ కాళహస్తి రాజేశ్వరి, తేజస్వీ, డీఎస్పీ రవిచంద్ర, తహసీల్దార్ కె.స్లీవజోజి తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు : అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామిని హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు శనివారం దర్శించుకుని పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎం దృష్టికి కుక్కునూరు మండల సమస్యలు


సీఎం చంద్రబాబును కలిసి టీడీపీ ములిశెట్టి

కుక్కునూరు, జూన్ 29: టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు అమరావతిలో సీఎం చంద్రబాబు దృష్టికి మండల సమ స్యలను తీసుకెళ్లారు. కుక్కునూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి గోతుల మయంగా మారిందని ఐదేళ్లు గా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. 41.1 కంటూరు లెవిల్‌లో ఉన్న గ్రామాలకు పోలవరం పునరావాస పరిహారం అందించాలని కోరారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి త్వరలో సమస్యలన్ని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, కేవీఆర్, ఉదయ్, రమణరాజు, నరేంద్రరాజు, సాంబశివరావు, కృష్ణ తదితరులు ఉన్నారు.

జన నేతకు ఆత్మీయ సత్కారం



రెడ్డి అప్పలనాయుడును సత్కరిస్తున్న ఆశ వర్కర్లు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 29 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి విశేష కృషి చేసిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనా యుడును శనివారం పవరుపేటలోని జనసేన కార్యాలయం వద్ద 4, 5, 6 డివిజన్లకు చెందిన ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో విచ్చేసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ మంచి చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

జనసేన స్థూపం ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 29 : స్థానిక దక్షిణపువీధిలోని రామాలయం వీధిలో నిర్మితమైన జనసేన స్థూపాన్ని శనివారం రాత్రి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటశాల వెంకటలక్ష్మి, జనసేన నాయకులు నారా శేషు, నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, కె.ఈశ్వరరావు, దాసరి శ్రీరామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పీకర్‌ని కలిసిన టీడీపీ నాయకులు


స్పీకర్‌ని సుజాత, టీడీపీ నేతలు

జంగారెడ్డిగూడెం, జూన్ 29 :ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని, రాష్ట్ర టీడీపీ నూతన అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను పట్టణ మాజీ మంత్రి పీతల సుజాతతో పాటు జంగారెడ్డి గూడెం తెలుగు దేశం పార్టీ నాయకు లు షేక్ ముస్తాఫా, వందనపు హరికృష్ణ, యడ్లపల్లి ఏడుకొండలు, కంచర్ల గణేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హిందు ధార్మిక మండలిని పునరుద్ధరించండి

ఏలూరు కలెక్టరేట్, జూన్ 29: వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన హిందూ ధార్మిక మండలిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని హిందు ధర్మ రక్షా సమితి సభ్యులు శనివారం కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు రాజనాల రామచంద్రరావు తదితరులు మాట్లాడారు. దేవాలయ భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హిందు సంఘాల నుంచి మాత్రమే కమిటీలను నియమించాలని విజ్ఞప్తి చేశారు. గోవధ శాలలను పూర్తిగా నిషేధించి ప్రభుత్వపరంగా గోరక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హిందు దేవాలయాల స్థిరాస్తుల వేలం, లీజులు, కేవలం హిందువులకే కేటాయించి న్యాయం చేయాలని కోరారు. నుదురుపాటి కృష్ణచైతన్యశర్మ, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగరాజు, చక్రధర్ శర్మ, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ పనులు పూర్తి

బుట్టాయగూడెం, జూన్ 29 : ఏజెన్సీలో మలేరియా జ్వరాలు ప్రబలకుండా బుట్టాయగూడెం సబ్ యూనిట్ పరిధిలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ పనులు శనివారంతో పూర్తి చేసినట్లు జిల్లా మలేరియా అధికారి జె.సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక వైద్యాధికారి డాక్టరు భాగ్యశ్రీ పిచికారీ పనులను పర్యవేక్షించినట్లు సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

30మంది విద్యార్థులకు దంత పరీక్షలు

చింతలపూడి, జూన్ 29: చింతలపూడి పట్టణం ఎస్‌బీఐ నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అధ్యక్షులు, దంత వైద్యులు డాక్టర్ బి.రాంబాబు ఉచిత దంత పరీక్షలు జరిపి, అవసరమైన విద్యార్థులకు మందులు అందజేసి పేస్ట్‌లు, బ్రెష్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సత్కారం

ఏలూరు టూ టౌన్, జూన్ 29: పదవీ విరమణ అనంతరం ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా ఆయురారోగ్యాలతో జీవించాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో శానిటరి మెస్త్రీగా పదవీ విరమణ చేసిన జాన్‌ప్రకాశ్‌రావ్ అభినందన సభలో చంటి పాల్గొన్నారు. జాన్‌ప్రకాశ్‌రావ్‌ను ఘనంగా సన్మానించారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

● ఉంగుటూరు : విశ్రాంత ఉద్యోగులు మిగతా కాలాన్ని సమాజసేవకు ఉపక్రమించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఉంగుటూరు ఈవోపీ ఆర్డీగా పని చేస్తున్న షేక్ షంషుద్దీన్ దంపతులను ఎమ్మెల్యే ధర్మరాజు సత్కరించారు.

● ఏలూరు క్రైం : వైద్య విధాన పరిషత్ శాఖకు సంబంధించి స్థానిక డీసీహెచ్ఎస్ కార్యాలయంలో సహాయ ఆర్థిక అధికారిగా పనిచేస్తున్న బలుసు బేబీ ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో కార్యాలయంలో ఆత్మీ వీడ్కోలు సభ నిర్వహించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

● కామవరపుకోట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన రమాసుందరిని హైస్కూలు ఆవరణలో ఎంఈవోలు డి.సుబ్బారావు, ప్రశాంత్‌కుమార్, సీనియర్ నాయకులు ఎంటీజేఆర్ ప్రసాదరావు, డాక్టర్ మేడూరి సత్యంబాబు, వైస్ సర్పంచ్ మేడూరి రంగబాబు, సహాయ ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు, హిందీ టీచర్ నాగరాజు, తదితరుల రమాసుందరిని దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోను బహుకరించారు.

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిసిన ప్రజాప్రతినిధులు, అధికారులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, నగర మేయర్ దంపతులు షేక్ నూర్జహాన్, పెదబాబు, సెర్ప్ అధికారులు

కూటమి పర్యవేక్షణలో పింఛన్లు పంపిణీ చేయండి

జంగారెడ్డిగూడెం, జూన్ 30 : పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధమైంది. ప్రభుత్వం ఇప్పటికే క్షేత్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ నెల చివరి రోజు ఆదివారం కావడంతో 29వ తేదీనే పింఛన్ల సొమ్ము బ్యాంకు నుంచి డ్రా చేశారు. స్థానిక కూటమి నాయకులను సమన్వయ పరుచుకుని పింఛన్లు పంపిణీ చేయాలని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణంలో పది సచివాలయాల పరిధిలో 4,947 పింఛన్లు ఉన్నాయని, వీరందరికీ రూ.మూడు కోట్ల 82 లక్షల 32 వేలు అవసరమవుతుందని తెలిపారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు మూడు వేల రూపాయలు, కలిపి మొత్తం రూ.ఏడు వేలను పింఛన్‌దారులకు అందజేస్తున్నామన్నారు. సచివాలయాల సెక్రటరీలు 88 మంది, అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది 19 మంది మొత్తం 107 మందితో ఒక్క రోజులోనే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే మండల స్థాయిలో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కేవీ ప్రసాద్ తెలిపారు.

● కామవరపుకోట : కూటమి నాయకులు, కార్యకర్తలు జూలై ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, బీజేపీ అధ్యక్షులు ఒంటెద్దు ఏసువరప్రసాద్, జనసేన మండల కన్వీనర్ షేక్ వలీ తెలిపారు.

● పెదపాడు : మండలంలో పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లుగా ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. మండలంలో మొత్తం 9,523 మందికి జూలై ఒకటో తేదీన వారి ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేస్తారన్నారు. లబ్ధిదారులంతా ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని ఎంపీడీవో సూచించారు.

● లింగపాలెం : నాయకుల సహకారంతో పింఛన్ల పంపిణీని సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎంపీడీవో ఒరుదు రాంబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అవసరాన్ని బట్టి అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలను వినియోగించుకోవాలన్నారు. ఒక్కొక్కరికి 50 మంది లబ్ధిదారులకు మాత్రమే లాగిన్ ఇస్తామని అన్నారు. పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పంచన్లు అందజేయాలన్నారు.

పీఎఫ్ సమస్యలపై యూటీఎఫ్ వినతి


అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 29 : పీఎఫ్ రుణాల ఫైనల్ పేమెంట్లకు ఉపాధ్యాయులు చేసుకున్న దరఖాస్తుల స్టేటస్‌ను తెలుసుకునేందుకు జిల్లా పరిషత్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌ముస్తఫా అలీ, రవికుమార్ తదితరులు శనివారం జడ్పీ డిప్యూటీ సీఈవోకు వినతిపత్రాన్ని అందజేశారు. కృష్ణా జిల్లా నుంచి ఏలూరు జిల్లాలో విలీనమైన ఎనిమిది మండలాలకు సంబంధించిన టీచర్ల ఖాతాల్లో పీఎఫ్ చందాలు జమ కావడం లేదని, దీనిపై అక్కడి జిల్లా జడ్పీ సీఈవోను సంప్రదించి పీఎఫ్ ఫైనల్ పేమెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జాప్యం లేకుండా ఫార్వర్డ్ చేసి రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఎయిడెడ్ యాజమాన్యం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి విలీనమైన ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు తెరిచేందుకువీలుగా ప్రతిపాదనలను స్వీకరించాలన్నారు. పది రోజుల్లోగా బ్యాలెన్స్ షీట్లు అందజేస్తామని సీఈవో హామీ ఇచ్చారని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. సంఘ నాయకులు మోహన్‌రావు తదితరులున్నారు.

పారిశుధ్య నిర్వహణ ప్రారంభించండి


ఖమ్మం జిల్లా తెలుగు మహిళలను సత్కరించిన ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూన్ 29 : గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పినకడిమి, కొప్పాక గ్రామాల్లో శనివారం పర్యటించిన ప్రభాకర్ ఆయా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై పంచాయతీ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్న సమయంలో వీధులు మురుగెత్తి ఉంటే ప్రజలు ఆరోగ్యం ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు. అసమర్ధ వైసీపీ పాలన పోయిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని, ఇకనైనా పనులపై దృష్టి పెట్టాలని, సిబ్బంది వ్యవహార శైలిలో మార్పురాకపోతే ప్రక్షాళన సిబ్బంది మార్పుతోనే ప్రారంభమవుతుందని ఆయన హెచ్చరించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి కనిపిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం టీడీపీ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన తెలుగు మహిళలను ఎమ్మెల్యే చింతమనేని ఘనంగా సత్కరించారు. ఖమ్మం జిల్లా తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాలు మందపల్లి రజనీ, మహిళా విభాగం నాయకులు కామా అనిత, పల్లగాని రమ్య, తదితరులను పుట్టింటి సాంప్రదాయంగా చీరె, సారెలతో సత్కరించారు. టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, మాగంటి నారాయణ ప్రసాద్, మేరుగు నాగరాజు, లావేటి శ్రీనివాస్, పెనుబోయిన మహేష్‌యాదవ్, మోతుకూని నానీ తదితరులు పాల్గొన్నారు.

'మానవతా' సేవలు మరింత విస్తృతం చేస్తాం


మెమొంటో అందిస్తున్న మానవతా మోహన్‌రావు

చింతలపూడి, జూన్ 29: సమాజంలో అవసరమైన వారికి సాయం చేయడమే, మానవతా లక్ష్యమని, ఈ సేవలు మరింత విస్తృతం చేస్తామని మానవతా స్వచ్ఛంద సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. చింతలపూడిలో శనివారం జరిగిన మండల శాఖ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన మహిత, నిహారిక, చరణ్‌కుమార్‌లకు ఒక్కొక్కరికి రూ.ఐదు వేల చొప్పున డైరెక్టర్లు మాడా సత్యనారాయణ, మాడా శ్రీనివాసరావు చేతులమీదుగా అందజేశారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలిగా కె.రాజేశ్వరి, కార్యదర్శిగా పి.సోమశేఖర్, కోశాధికారిగా జె.విశ్వేశ్వరరావును ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు టి.రమేష్, డి.రత్నాకర్, అజయ్, స్థానిక నాయకులు ఎ.అప్పారావు, ఎ.రాజారావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా పవన్


బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్

ద్వారకాతిరుమల, జూన్ 29: ద్వారకా తిరుమల వేంకటేశ్వర విశాల సహకార సంఘ పర్సన్ ఇన్‌చార్జిగా వి.పవన్‌చక్రవర్తి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయానికి వెళ్లి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతకు ముందు వైసీపీ ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలు రాజీనామా చేశాయి. ఈ క్రమంలో వారి స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను కూటమి ప్రభుత్వం నియమించింది. సంఘ కార్యదర్శి నల్లూరి శ్రీకిషోర్ పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో అర్చనలు, పారాయణలు

ఏలూరుకార్పొరేషన్, జూన్ 29 : నగరంలోని పలు డివిజన్లలో గల శ్రీవారి ఆలయాల వద్ద శనివారం భక్తులు స్వామివారికి తులసీదళాలు, పుష్పాలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. గోవిందనామ సంకీర్తనలు ఆలపించి భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

గ్రీన్ అంబాసిడర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

పోలవరం, జూన్ 29 : విద్యుదాఘాతానికి మృతి చెందిన నరసాపురం రూరల్ కొప్పర్రు గ్రీన్ అంబాసిడర్ చంద్రపాల్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం పంచాయతీ కార్మికులు గ్రీన్ అంబాసిడర్ చంద్రపాల్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్మికులు వారా నాని, బంగారు వెంకటేశ్వరరావు, వారా పోశి, నరేశ్, శేషగిరి, మాడుగుల సాయి, సామేలు, రత్నం పాల్గొన్నారు.

కేసుల పరిష్కారం సంతోషదాయకం


కేసులను పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రిషిక్

భీమడోలు, జూన్ 29: రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం చేసుకోవడం వల్ల ఉభయ వర్గాలు సంతోష పడతాయని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి తల్లాప్రగడ అంజని ఎస్ఎస్ రామాదిత్య రిషిక్ అన్నారు. స్థానిక కోర్టులో శనివారం లోక్ అదాలత్ జరిగింది. ఆరు సివిల్, 29 క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.

● చింతలపూడి : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 81 కేసులు పరిష్కరిస్తూ జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తీర్పు చెప్పారు. ఇందులో క్రిమినల్ కేసులు 48, సివిల్ కేసులు ఆరు, బ్యాంక్ కేసులు 21, బీఎస్ఎన్ఎల్ కేసులు ఆరు పరిష్కారమయ్యాయి. కాంపౌండ్ ఫీజు కింద రూ.42 లక్షల 96 వేలు వసూలు అయినట్లు తెలిపారు. బార్ అధ్యక్షులు అబ్బి నాగేశ్వరరావు, లోక్‌అదాలత్ సభ్యులు ఎండీ అక్బర్‌అలీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సీహెచ్ కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగింది. వివిధ రకాల కేసులు 142 పరిష్కారమైనట్లు కిషోర్ తెలిపారు

కూటమి నేతలతో కమిషనర్ డ్రైన్ల పరిశీలన


డ్రైన్‌లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

చింతలపూడి, జూన్ 29: నగర పంచాయతీలోని డ్రైన్లను కూటమి నేతలతో కలిసి కమిషనర్ ప్రసాద్‌రాజు శనివారం పరిశీలించారు. వర్షం వస్తే నీరుపోయే దారిలేదని, మెయిన్ రోడ్డు ఇరుపక్కల ఉన్న డ్రైన్లలో సిల్ట్ పేరుకుపోయి, రోడ్లపైకి నీరు చేరటం వల్ల రోడ్లు పాడవుతున్నాయని, ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఈ డ్రైన్‌లపై దృష్టిపెట్టి అధికారులకు సూచనలు చేసి పరిశీలన చేయాలని ఆదేశించారు. దీంతో శనివారం నగర పంచాయతీలోని బైపాస్ రోడ్డు, సాయిబాబా గుడి సెంటర్, మినీ బస్టాండు మెయిన్‌రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ సెంటర్, పలుచోట్ల కూటమి నేతలతో కమిషనర్ ప్రసాదరాజు పరిశీలించారు. పూడిక పనులు చేపడతామని, అవసరమైన చోట ఆక్రమణలు తొలగిస్తామని, ప్రజల సహకారం ఉండాలని ఆయన కోరారు. ఆయన వెంట కూటమి నేతలు మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, పట్టణ టీడీపీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు బోడా నాగభూషణం, కొత్తపూడి శేషగిరిరావు, తాటి అప్పారావు, రాజారత్నం, అనిష్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పోషణ సక్రమంగా ఉండాలి

పెదవేగి, జూన్ 29 : పిల్లల ఎత్తు, బరువు ఎప్పటికప్పుడు సరిచూస్తూ పోషణ సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పెదవేగి సెక్టారు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి సూచించారు. అంగన్‌వాడీ సెక్టారు సమావేశం పెదవేగి, విజయరాయిలో శనివారం నిర్వహించారు. వర్షాకాలంలో పిల్లల ఆరోగ్య సంరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఆమె సూచించారు.

జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన జాస్మిన్



కామవరపుకోట, జూన్ 29 : ఎన్ఎఫ్ఎస్‌యూ జాతీయ పరీక్షా ఫలితాల్లో 24వ ర్యాంకు సాధించిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ అర్హత పరీక్షా ఫలితాల్లో ప్రతిభ సాధించిన తాడిచర్లకు చెందిన కొప్పుల జాస్మిన్‌ను శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, స్థానికులు సత్కరించారు. తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథిబాబు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఘంటా సుధీర్‌బాబు తదితరులు ఉన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరు రూరల్, జూన్ 29: ఏలూరు దొండపాడులో ఉన్న ఉమ ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను శనివారం సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన సేవలు సంస్థ ద్వారా అందించటం జరుగుతుందన్నారు. సంస్థలో కృత్రి మ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజి, స్పీచ్‌థెరపీ, యూడీఐడీ, నిరామయ హెల్త్ కార్డులు తదితర సేవలు అందిస్తున్నా మన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

70 మంది దివ్యాంగుల గుర్తింపు

దెందులూరు, జూన్ 29 : ప్రత్యేకావసరాలు కలిగిన వారిని గుర్తించి ఉచితంగా ఉపకరణాలు అందజేసేందుకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఒకటి నుంచి 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ప్రత్యేకావసరాలు కలిగిన 70 మందిని గుర్తించామని మండల విద్యాశాఖాధికారులు ప్రసాద్, అన్నమ్మ, హెచ్ఎం రామశర్మ తెలిపారు. జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖర్, జిల్లా సమగ్ర శిక్షణ విలీన విద్య సమన్వయ కర్త బొర్రా భాస్కర్ రాజు పర్యవేక్షణలో నిర్వహించారు.

వృద్ధులు, వితంతువులను ఆదుకోవాలి

ఏలూరుటూటౌన్, జూన్ 29: వృద్ధులు వితంతువులను ఆదుకోవాలని డిప్యూటీ మాజీ మేయర్ చోడే వెంకటరత్నం అన్నారు. కరుణమయి మహిళా మండలి ఆధ్వర్యంలో కుమారి రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, జిజ్జవరపు ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జిజ్జవరపు రత్నకుమారి వృద్ధులకు వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు జిజ్జవరపు ప్రతాప్ కుమార్, పార్థసారథి, ప్రభాకర్, చంద్రశేఖర్, రవిప్రకాశ్, లోకేష్ పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెదపాడు, జూన్ 29 : వాతావరణ మార్పుల దృష్ట్యా పశువులకు సంక్రమించే వ్యాధులపై పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పెదపాడు పశు వైద్యాధికారిణి వాణిసంధ్య తెలిపారు. పెదపాడు పశువుల ఆసుపత్రి ఆవరణలో సీజనల్ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు శనివారం నిర్వహించారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసరు మేరుగు ఫణికుమార్, సిబ్బంది రవి, అజయ్, క్రాంతికుమార్, షబానా, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

ఉంగుటూరు, జూన్ 29 : నల్లమాడు ఇండస్ట్రియల్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తపస్య పాఠశాలకు అనుమతి లేదు

కామవరపుకోట, జూన్ 29 : కొత్తూరులోని చెక్ పోస్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన తపస్య పాఠశాలకు ప్రభుత్వ అనుమతిలేదని మండల విద్యాశాఖాధికారులు డి.సుబ్బారావు, సీహెచ్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆ పాఠశాలను శనివారం సందర్శించి నిర్వాహకులతో చర్చ జరిపి అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన జిల్లా విద్యాశాఖా ధికారి అబ్రహం ఈ పాఠశాలను సందర్శించి సౌకర్యాలు లేని కారణంగా అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారన్నారు. అయినప్పటికీ మేనేజ్‌మెంట్ విద్యార్థులను పాఠశాలలో చేర్చు కుంటున్నారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటుం దని, టీసీలు పొందేందుకు విద్యార్థులు ఇబ్బంది పడతారని హెచ్చరించారు.

ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించండి

పోలవరం, జూన్ 29 : పోలవరం-విజయవాడ ఆర్టీసీ బస్సును పునరుద్ధ రించా లని గ్రామస్తులు శనివారం కోరారు. 2017 వరకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపేవా రని కొన్ని రోజుల అనంతరం నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసును పునరుద్దరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉంగుటూరు, జూన్ 29 : నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. మండల మానవత అధ్యక్షునిగా వేగేశ్న రంగరాజు, కార్యదర్శిగా గంజి రవికుమార్, కోశాధికారిగా పీవీవీఎస్ ప్రసాద్(బుల్లియ్య) ఉపాధ్యక్షుడిగా కోనే సత్యనారాయణ పలువురు సభ్యులుగా ఎంపియ్యారు. రాష్ట్ర వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, విస్తరణ అభివృద్ధి అధికారి సాగిరాజు జానకిరామ రాజు, ఎడిటోరియల్ నాయకులు రామిశెట్టి గంగాధరరావు, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, గుణ్ణం బుల్లెబ్బాయి, శీతాల సత్యనారాయణ, సర్పంచ్ దిడ్ల అలకనంద పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ

జీలుగుమిల్లి, జూన్ 29 : భూములు ఆన్‌లైన్ పేరుతో అక్రమ వసూళ్లు పేరుతో ఆంధ్రజ్యోతిలో శనివారం వచ్చిన కథనానికి రెవెన్యు అధికారులు స్పందించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో జీలుగుమిల్లి తహసీల్దారు, డీటీ, వీఆర్వోను వివరణ కోరారు. సంబంధిత అధికారుల్ని ఆర్డీవో కార్యాలయా నికి పిలిచిన విషయమై ఆర్డీవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ అందుబాటులోకి రాలేదు.

లెదర్ వస్తువుల తయారీపై శిక్షణ

ఏలూరు టూ టౌన్, జూన్ 29: లెదర్ వస్తువుల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ సొసైటీ ఎగ్జిక్యూటీ వ్ డైరెక్టర్ సోమశేఖర్ అన్నారు. ఎస్సీ మాదిగ కులానికి చెందిన పురుష అభ్యర్థులు అర్హులన్నారు. కనీసం 10వ తరగతి పాసైన 21 నుంచి 40 ఏళ్ల మధ్య వయుస్సులై ఉండాలన్నారు. కుల ధ్రువీకరణ, ఆధార్ తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు సోమవారం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 29 : మలేరియా వ్యతిరేక మాసోత్సవం ముగింపు కార్యక్రమం శనివారం స్థానిక కొత్తపేట గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూలులో జరిగింది. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనతోపాటు, పలు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ శశాంక్ సూచనలు చేశారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది మార్తమ్మ, శ్రీనివాసరావు, రమేష్, హెచ్ఎం కృష్ణప్రసాద్, పీఈటీ అరుణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ


కుక్కునూరులో కిట్లు పంపిణీ చేస్తున్న కూటమి శ్రేణులు

కుక్కునూరు, జూన్ 29: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు కిట్లు అందజేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ 10వ తరగతిలో క్లాస్ ఫస్ట్ వస్తే రూ.10,116, సెకండ్ వచ్చిన వారికి రూ.5,116 నగదు అందిస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, వెంకన్నబాబు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

● టి.నరసాపురం : కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జయ్యవరపు శ్రీరామమూర్తి, సర్పంచ్ తడికలపూడి శివ మాధవి, కిషోర్ కుమార్, మాజీ సర్పంచ్ వెలిది నాగబాబు, ఉప సర్పంచ్ భీమవరపు జగన్మోహన్‌రావు, లింగారెడ్డి శ్రీనివాసరావు, లింగారెడ్డి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు వేయండి

పోలవరం, జూన్ 29 : పోలవరం నుంచి తహసీల్దారు కార్యాలయానికి వెళ్ళే రోడ్డులో వీధిలైట్లు వేయాలని పోలవరం పంచాయతీ పాలకవర్గ సభ్యులు మేడుం పార్వతి, మంగిన పోశిరత్నం, మంగిన వెంకటరమణ, పట్నాల దేవి కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం సభ్యు లు మాట్లాడుతూ ఈ మార్గంలో రెండు కిలోమీటర్ల మేర వీధిలైట్లు లేకపోవడం రాత్రివేళ్ల రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారన్నారు. రోడ్డుకి ఇరువైపులా పంట పొలాలు కావడం, వర్షాలం వలన విషసర్పాలు రోడ్డుపైకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆ మార్గంలో వీధి లైట్లు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

150 మందికి వైద్య సేవలు

పోలవరం, జూన్ 29 : కొండ్రుకోట పునరావాస కాలనీలో ఎల్లండీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.నిఖిల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసన్ అండర్ ఫేమిలీ అడాప్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీవీ విజయకుమార్ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాలలోని 150 మందికి వైద్య సేవలందించి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. డిప్యూటీ మలేరియా అధికారి డాక్టర్ సురేష్, వైద్యులు జి.గంగాభవాని, అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్గా కుమార్, అసోసియల్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



దాగురే విగ్రహం వద్ద ఫొటోగ్రాఫర్ల నివాళి

ఘనంగా కెమెరా దినోత్సవం

కైకలూరు, జూన్ 29: మారుతున్న కాలానికి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు వృత్తి నైపుణ్యత సాధించేందుకు ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కైకలూరు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సాగర్‌బాబు అన్నారు. శనివారం జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా కైకలూరులో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ దాగురే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. సృష్టిలో కెమెరా అనేది కనిపెట్టకుండా ఉంటే నేటి ప్రపంచంలో ఏం జరిగినా మరొకరికి తెలిసేది కాదన్నారు. కెమెరాను నమ్ముకుని జీవిస్తున్నవారికి వృత్తి నైపుణ్య కేంద్రాలను ఏర్పాటుచేసి వారికి ఉచితంగా శిక్షణను ఇప్పించడంతో పాటు ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా సబ్సిడీపై కెమెరాలను అందజేయాలని కోరారు. సంఘ గౌరవ అధ్యక్షుడు టీఎస్ ఆచారి, మాజీ అధ్యక్షుడు కె. సుమంత్, ఉపాధ్యక్షుడు ఎస్. సుబ్రహ్మణ్యం, ఫోటోగ్రాఫర్లు సీహెచ్ ప్రేమ్‌కిరణ్, కె. బాలాజీ, నరేంద్ర, సతీష్ కిరణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

4న మామిడి మార్కెట్ ఏర్పాటుపై సమావేశం

హామీల అమలు దిశగా సారథి అడుగులు

నూజివీడు, జూన్ 29: నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి తాను ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చే దిశగా నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అడుగులు వేస్తున్నారు. నూజివీడు ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తికి శాప్‌నుంచి నిధులు మంజూరు చేయించి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో మరో ప్రధాన సమస్య అయిన మామిడి మార్కెట్ ఏర్పాటుకు తొలి అడుగులు వేస్తూ ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల మామిడి రైతులతో జూలై 4వ తేదీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మామిడికి పేరుగాంచిన నూజివీడులో సరైన మార్కెట్ లేకపోవడం వల్ల మామిడి రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటాననే హామీని అమలు పరిచేందుకు జూలై 4వ తేదీ నూజివీడు మార్కెట్ యార్డులో రైతులు, మామిడి ఎగుమతిదారులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు నూజివీడు ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని విస్సన్నపేట, తిరువూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఏ.కొండూరు పరిసర ప్రాంత మామిడి రైతులు, ఎగుమతి దారులు 4వ తేదీ ఉదయం 11 గంటలకు ఏఎంసీలో నిర్వహిస్తున్న సమావేశానికి హాజరై మామిడి మార్కెట్ ఏర్పాటుకు సూచనలు, సలహాలివ్వాలని శ్రీనివాసరావు కోరారు.

పదవీ విరమణ సత్కారం



ఆగిరిపల్లి, జూన్ 29: మండలంలోని శోభనాపురంలో ఎంపీయూపీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాచర్ల పాపారావు శనివారం పదవీ విరమణ చేశారు. ఆయన స్టూడెంట్స్‌కి మెటీరియల్ సహాయం చేయటం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్థుల మన్ననలు పొందారు.

పర్సన్ ఇన్‌చార్జిలు బాధ్యతల స్వీకారం

ముదినేపల్లి, జూన్ 29 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నియమితులైన పర్సన్ ఇన్‌చార్జ్ (పీఐసీ)లు శనివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ముదినేపల్లి బ్రాంచి పరిధిలోని ఆయా సంఘాల కార్యాలయాల్లో పీఐసీలు బాధ్యతలను స్వీకరించారు. 2018లో సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పూర్తయ్యాక గత ఆరేళ్లలో సంఘాలకు అధికారులను పీఐసీలుగా నియమించటం ఇదే తొలిసారి. పీఐసీలు పలు సంఘాల్లో దుకాణాలకు సంబంధించి సి-ఫారాలపై కూడా సంతకాలు చేశారు. ముదినేపల్లి బ్రాంచి పరిధిలోని సహకార సంఘాలకు ఏలూరు, కైకలూరు సబ్ డివిజనల్ సహకార శాఖ అధికారులే నియమితులయ్యారు. సహకార ఆర్థిక సంవత్సరానికి చివరి రోజైన శనివారం పీఐసీలు బాధ్యతలు చేపట్టడంతో సంఘాల కార్యకలాపాలకు అవరోధం లేకుండాపోయింది.

చాట్రాయి: మండలంలోని 7 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమితులైన అధికారులు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చాట్రాయి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా పి సాల్మాన్‌రాజు, చనుబండ, చిన్నంపేట, బూరుగ్గూడెంలకు చంద్రబాబు, తుమ్మగూడెం, పోలవరం, నరశింహారావుపాలెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా అబ్దుల్ సలీం బాధ్యతలు చేపట్టారు. నూజివీడు డీఆర్(కో-ఆపరేటివ్) ఆఫీస్‌లో పనిచేస్తున్న ఈ ముగ్గురు అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమితులయ్యారు.



విద్యార్థులకు పుస్తకాల వితరణ

మండవల్లి, జూన్ 29: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కూటమి నాయకుడు సజ్జ సురేష్ బాబు (బాబి) కోరారు. మండవల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శనివారం టీడీపీ నాయకుడు నల్లమోతు పాండురంగారావు ఆర్థిక సాయంతో నోటు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీని బాబి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కూటమి నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, గుడివాడ చిట్టిబాబు, కోట విప్లవ వరప్రసాద్ హెచ్ఎంలు కే రాహేలు, పి. ప్రతాప్‌కుమార్‌లను సత్కరించారు. శుభం ఫంక్షన్ హాలు అధినేత డాక్టర్ సుధాబత్తుల విజయకుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ముసునూరు, జూన్ 29: రమణక్కపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి తూర్పుదిగవల్లికి చెందిన ట్రాక్టర్ చెక్కపల్లి వైపు వెళుతుండగా, రమణక్కపేటకు చెందిన ప్రొద్దుటూరు గణేష్ అనే యువకుడు చెక్కపల్లి నుంచి బైక్‌పై వస్తూ మెయిన్ సెంటర్ వద్ద ట్రాక్టర్‌ను తప్పించబోయి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గణేష్‌కు తీవ్ర గాయాలవడంతో వెంటనే 108 వాహనంపై స్థానికులు నూజివీడు ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పి.వాసు తెలిపారు.

పైప్‌లైన్ ఏర్పాటుపై ఘర్షణ.. ఒకరికి గాయాలు

ముసునూరు, జూన్ 29: మండలంలోని కాట్రేనిపాడు ఎస్సీ కాలనీలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా వేసే పైప్‌లైన్ పనులపై ఘర్షణ జరిగింది. కాలనీలో చర్చికు ఎదురుగా ఉన్న రోడ్డులో పైప్‌లైన్ వేయాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు ప్రారంభం నుంచి సగం వరకు మాత్రమే రెండు గజాలు వెడల్పు ఉందని, చివరి వరకు ఒకే విధంగా ఉండేలా విడగొట్టాలని, రహదారి చివరన ఉన్న అమృత శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని ఒక మహిళ అడ్డుపడింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో శ్రీనివాసరావు తలకు చిన్న గాయమైంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఇరువర్గాలతో మాట్లాడారు. రహదారి ఆక్రమణను తీసివేస్తేను పైప్‌లైన్ వేయడానికి కుదురుతుందని, ఇరువర్గాల వారు సహకరించాలని కార్యదర్శి కోరారు. ప్రస్తుతం పైప్‌లైన్ వేసే ప్రక్రియను కాంట్రాక్టర్ నిలిపివేశారు.

కేసుల రాజీ

నూజివీడు, కైకలూరుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

లక్షలాది రూపాయల పరిహారం పంపిణీ



నూజివీడు లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి నాగశైలజ

నూజివీడు, జూన్ 29: లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కోర్టు విలువైన సమయంతో పాటు ఆర్థిక భారాన్ని కూడా తగ్గించుకోవచ్చని, 15వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎ.నాగశైలజ అన్నారు. నూజివీడు కోర్టుహాలు ప్రాంగణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 6 మోటారు వెహికల్ యాక్సిడెంట్ కేసులు పరిష్కరించి బాధితులకు నష్ట పరిహారంగా రూ. 50,40,000లను చెల్లించారు. మొత్తం 148 కేసులను పరిష్కరించారు. న్యాయాధికారులు షేక్ పెద ఖాశిం, కె.హరిబాబు, వి.వెంకటేశ్వరరావు, స్పెషల్ మేజిస్ట్రేట్ వి.కృష్ణమూర్తి, సీనియర్ న్యాయవాదులు కేవీవీ విక్రమ్ కుమార్, మడుపల్లి బసవారావు, సయ్యద్ ఫరూక్, ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కైకలూరులో...

కైకలూరు, జూన్ 29: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే ఇరువర్గాలు గెలిచినట్టేనని కైకలూరు సీనియర్ న్యాయ సేవాధికారిణి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. శనివారం కైకలూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే ఇరు వర్గాలకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 108 కేసులను రాజీ చేసి వాటి ద్వారా కక్షిదారులకు రూ.86,27,920లు నగదును అందజేశారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. శివకిరణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్డీయే కూటమి నాయకులు

కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు సహించం

కైకలూరు, జూన్ 29: కూటమి గెలుపుతో రాష్ట్రంలోనే కాక కైకలూరు నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరులో కూటమి నాయకులతో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కైకలూరు నియోజకవర్గంలో అరాచకాలు పెరిగిపోయాయంటూ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. అనివేటి మండపం, హిందూ శ్మశాన వాటిక నిర్మాణాలను దాతల సహకారంతో చేశారని వాటి జమా ఖర్చులను బయటపెట్టాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే కామినేనిపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఇష్టానుసారం మాట్లాడితే కూటమి నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కైకలూరు జగనన్న కాలనీలో 300 ప్లాట్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా రహదారి వెంబడి వదిలివేయడంలో మర్మమేమిటని ప్రశ్నించారు. లే అవుట్ పూడికలో అవినీతి జరిగిందన్నారు. కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో కోట్ల విలువైన బియ్యం మాయమైపోయాయని దానిపై మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలపై త్వరలోనే విచారణ జరిపిస్తామన్నారు. కూటమి నాయకులు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, చిట్టూరి రవీంద్ర, చెన్నంశెట్టి మురళీకృష్ణ, నల్లగోపుల చలపతి, కోటప్రోలు కృష్ణారావు, పీజెఎస్ మాల్యాద్రి, ఎండీ జానీ తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంబుల వైష్ణవి

గంజాయి రహిత సమాజానికి పాటు పడదాం: వైష్ణవి

ముదినేపల్లి, జూన్ 29 : డ్రగ్స్ రహిత సమాజం ఏర్పడాలని ఆకాంక్షిస్తూ ముదినేపల్లిలో శనివారం అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ఈ ర్యాలీలో గంజాయి వద్దు - మంచి భవిష్యత్తే ముద్దు అంటూ నినాదాలు చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందామని విద్యార్థులతో వైష్ణవి ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిని పట్టిస్తే తగిన పారితోషికం అందజేస్తామని వైష్ణవితోపాటు ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ ప్రకటించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు, కలిదిండికి చెందిన డాక్టర్ మస్తాన్ వలీ, విద్యావేత్త కోడూరు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత చొరవతో రహదారికి మోక్షం



ముదినేపల్లి, జూన్ 29 : వర్షాలకు ధ్వంసమై ప్రమాదకరంగా మారిన ముదినేపల్లి - గుడ్లవల్లేరు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి మరమ్మతు పనులు టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ చొరవతో శనివారం నిర్వహించారు. ఈ రోడ్డులో ముదినేపల్లి - గురజ గ్రామాల మధ్య గోతులు పెద్దవై ప్రమాదాలు జరుగుతుండటంతో వినోద్ స్పందించి ముదినేపల్లిలో పనులు నిర్వహిస్తున్న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో చర్చించగా, గోతులను పూడ్చేందుకు ఏడు టిప్పర్ల మిక్స్‌డ్ మెటీరియల్ ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రహదారి మరమ్మతు పనులను పూర్తి చేశారు.

24 వరకు ఐటీఐ అడ్మిషన్లు

నూజివీడు టౌన్, జూన్ 29: నూజివీడు ఐటీఐలో ప్రవేశాలకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ జూలై 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నూజివీడు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ డి.భూషణం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌ల ద్వారా దాఖలు చేయాలని ఆయన కోరారు.

విధుల్లో ఉన్నది 74 మంది వలంటీర్లే!

నూజివీడు టౌన్, జూన్ 29: నూజివీడు మండలంలో కేవలం 74 మంది వలంటీర్లు మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. మండలంలోని 26 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 447 మంది వలంటీర్లను నియమించగా, ఎన్నికల ముందు 371 మంది రాజీనామాలు చేశారు. మండలంలోని తుక్కులూరు, సుంకొల్లు, సీతారాంపురం, కొత్తరావిచర్ల, పాతరావిచర్ల, ముక్కొల్లుపాడు, మొర్సపూడి, మర్రిబంధం, జంగంగూడెం, యనమదల, దిగవల్లి, దేవరగుంట గ్రామాల్లో ఉన్న వలంటీర్లు అందరూ రాజీనామా చేశారు. ఇక వెంకటాయపాలెం, హనుమంతులగూడెం, గొల్లపల్లి 1వ సచివాలయ పరిధిలో దాదాపు సగం మంది విధుల్లో ఉండగా, మిగిలిన గ్రామాల్లో ఒకరో, ఇద్దరో మాత్రమే విధులను నిర్వర్తిస్తున్నారు.

నూరు శాతం రుణాల వసూలు

ముదినేపల్లి, జూన్ 29 : పదేళ్లుగా ప్రతి ఏటా నిర్ణీత సమయంలో నూరు శాతం రుణాలు వసూళ్లు చేస్తూ ముదినేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం రికార్డు సృష్టించింది. 2014-15 సహకార ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జూన్ 30 లోపు దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను వసూలు చేయటంలో ముందంజలో ఉంది. ఈ ఏడాది కూడా సంఘ సభ్యుల స్థాయిలో రూ.3.72 కోట్ల రుణాల డిమాండ్ కాగా, ఈ నెల 29 నాటికే నూరు శాతం వసూలు చేశారు. ఇందుకు సంబంధించి స్టేట్‌మెంట్ కాపీని సంఘ సీఈవో అల్లాడ దుర్గారావు ముదినేపల్లి సహకార బ్యాంక్ బ్రాంచి మేనేజ్ వీవీఎల్ సత్యకుమార్‌కు శనివారం అందజేశారు.

సీజనల్ వ్యాధుల్ని తలెత్తనివ్వద్దు

ముసునూరు, జూన్ 29: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి ఆదేశించారు. శనివారం ముసునూరు పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులపై ఆశావర్కర్లు, ఏఎన్ఎంలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వ హించారు. గ్రామాల్లో సర్పంచ్‌లను సమన్వయం చేసుకుని దోమలు నివారణకు మలాథియాన్ పిచికారీ చేయించాలన్నారు. మురుగునీటి నిల్వలు తొలగించి, బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. జ్వరాల బారిన పడిన వారిని వెంటనే ఆరోగ్య కేంద్రానికి తరలించి, తగిన చికిత్స అందించేలా చూడాల న్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి హుండీ ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి, జూన్ 29:మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హుండీలు లెక్కించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య, దేవదాయశాఖ గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పర్యవేక్షణలో సిబ్బంది నిర్వహించిన లెక్కింపులో 197 రోజులకు రూ. 13 లక్షల నగదు, 5 గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి లభించాయి. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ శొంఠి నాగరాజు, వల్లభనేని రామకృష్ణ, శ్రీ దుర్గా సాయి సంఘ కమిటీ సభ్యులు, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్, వీఆర్వో రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి

కలిదిండి, జూన్ 29 : గ్రామాల్లో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో దినతేజ్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలుషిత నీటిపై అవగాహన కల్పించాలన్నారు. వాంతులు, విరేచనాలు అవుతున్న వారిని గుర్తించి వెంటనే వైద్యం అందించాలన్నారు. నిల్వ ఉన్న ఆహారం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అతిసార నివారణ మందులను పీహెచ్‌సీలో అందుబాటులో ఉంచాలన్నారు. కలిదిండి, కోరుకొల్లు, మూల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

గ్రామసభలపై ర్యాలీ

మండవల్లి, జూన్ 29: అన్ని గ్రామ పంచాయతీల్లో జూలై 1వ తేదీ నుంచి నిర్వహించనున్న గ్రామసభలపై మండవల్లిలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామస్థులంతా గ్రామసభలకు హాజరవ్వాలని కోరారు. గన్నవరంలో శనివారం గ్రామసభల నిర్వహణపై అవగాహన కల్పించారు. మండవల్లి మండల ఐక్యవేదిక అధ్యక్షుడు టి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పండుగ

ఇళ్లకు వెళ్లి పంపిణీకి అధికారుల ఏర్పాట్లు



పెన్షన్ సొమ్ము డ్రా చేస్తున్న శ్రీహరిపురం బ్యాంక్ వద్ద ఎస్ఐ వెంకట్ కుమార్ బందోబస్తు

నూజివీడు టౌన్, జూన్ 29: నూజివీడు మండలంలోని 29 గ్రామాల పరిధిలో 10,623 మందికి సామాజిక పింఛన్‌ల రూపేణా 7 కోట్ల 16 లక్షల 95 వేల 500లను జూలై 1న పంపిణీ చేస్తున్నట్లు నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని పోతురెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖా మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా పింఛన్‌లను పంపిణీ జరుగుతుందని, ప్రతి గ్రామంలోనూ పండుగ వాతావరణంలో ఈ పింఛన్‌లను పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు.

చాట్రాయి: మండలంలో జూలై 1న పెన్షన్లు పంపిణీకి ఎంపీడీవో మంగాకుమారి ఆధ్వర్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో 8542 మంది పెన్షన్‌దారులకు రూ. 5 కోట్ల 83 లక్షల 48 వేలు పంపిణీ చేయటానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. పెన్షన్లు పంపిణీ కోసం 181 మంది సచివాలయ, వైద్య ఆరోగ్య ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లను నియమించి, వారిని ఆన్‌లైన్ మ్యాపింగ్ చేశారు. 30న ఆదివారం కావటంతో పెన్షన్లు సొమ్మును శనివారం సాయంత్రమే బ్యాంకుల నుంచి డ్రా చేశారు. ఒక్కో ఉద్యోగికి 50 నుంచి 60 పెన్షన్లు కేటాయించి సాయంత్రానికి 100 శాతం పంపిణీ పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈసారి రూ. 7000 పెన్షన్‌లు అందుకోవటానికి లబ్ధిదారులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.



పెన్షన్ జాబితాలు పరిశీలిస్తున్న చాట్రాయి ఎంపీడీవో మంగాకుమారి

ముదినేపల్లి: జూలై 1న పంపిణీ చేయాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ల సొమ్ము సిద్ధమైంది. పంపిణీ చేయాల్సిన సొమ్మంతా ఒకేసారి ప్రభుత్వం నుంచి విడుదలైంది. ముదినేపల్లి మండలంలోని 9073 మంది పెన్షన్‌దారులకు పంపిణీ చేసేందుకు విడుదలైన రూ.6.12 కోట్ల సొమ్మును శ్రీహరిపురం యూనియన్ బ్యాంక్ నుంచి శనివారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. డ్రా చేస్తున్న సొమ్ము కోట్లలో ఉండటంతో ఎంపీడీవో మురళీ గంగాధరరావు అభ్యర్థన మేరకు ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించి భద్రత కల్పించారు. సోమవారం పెన్షన్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కలిదిండి: పెన్షన్లు ఇళ్ల వద్దే పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు వెయ్యి చొప్పున రూ.3 వేలతోపాటు పెంచిన నెల వారీ పెన్షన్ రూ.4 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు చొప్పున పెన్షన్ల లబ్ధిదారునికి పంపిణీ చేస్తామన్నారు. పెన్షన్‌దారులు మొత్తం 9,762 మంది అని వీరికి ఇవ్వాల్సిన మొత్తం 6 కోట్ల 51 లక్షల 90 వేల రూపాయలు అని తెలిపారు.



మంత్రి పార్థసారథితో నూజివీడు బీజేపీ నాయకులు

మంత్రి సారథికి బీజేపీ నాయకుల అభినందన

నూజివీడు టౌన్, జూన్ 29: రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని నూజివీడు నియోజకవర్గ బీజేపీ నాయకులు శనివారం కలిసి అభినందించారు. నియోజకవర్గ బీజేపీ నాయకులు శ్రీనివాస కుమార్ అప్పారావు, శివరాజు వసుంధరాదేవి, వైఎస్ దొరై, సాయిల సత్యనారాయణ, వరుగు రఘు, రవి, శ్రీరంగం తదితరులు మంత్రిని అభినందించారు. గొల్లపల్లి రఘునాథస్వామి కృపతో కూటమి ప్రభుత్వం ఏర్పడి, నూజివీడు ఎమ్మెల్యేగా పార్థసారథి గెలిచి, మంత్రిగా బాధ్యతలు స్వీకరిం చటం వల్ల నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని వారు ఆకాంక్షించారు.